క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వేగంగా పరీక్షల నివేదికలు



ఇందుకూరుపేట : ఆక్వా రైతులకు నీటి నాణ్యత, వ్యాధులు తదితరాల పరీక్షల నివేదికలను త్వరితగతిన అందించడమే మొబైల్ ప్రయోగశాల లక్ష్యమని ఆర్‌జీసీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ అనూప్ మండల్ అన్నారు. మండలంలోని కుడితిపాళెం గ్రామంలో ఆర్‌జీసీఏ మొబైల్ ప్రయోగశాల ద్వారా రైతుల వద్ద పలు నమూనాలు సేకరించి పరీక్షల ఫలితాలను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన ప్రయోగశాల సిబ్బంది నేరుగా చెరువు వద్దకు చేరుకుని నమూనాలను సేకరించడం ద్వారా ఫలితాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ బి.అప్పలనాయుడు, ఫీల్డ్ ఆఫీసర్లు కృష్ణకాంత్ వరదరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపాలని, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయని విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో గురువారం అంతర్ కళాశాలల స్టాఫ్ పురుషులు, మహిళల క్రీడా పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, టెన్నిస్, చెస్, టేబుల్ టెన్నిస్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 వేల హెక్టార్లలో సూక్ష్మసేద్యం లక్ష్యం

- పీడీ శ్రీనివాసులు



డ్రిప్‌ను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసులు

పొదలకూరు : జిల్లాలో 5 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం సాగు చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. పొదలకూరు, చేజర్ల మండలాల్లో నిమ్మ, బొప్పాయి తోటలకు ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ సాగును పీడీ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 3 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కింద పైపులను సబ్సిడీపై రైతులకు అందజేసినట్లు వెల్లడించారు. మిగిలిన 2 వేల హెక్టార్లలో కూడా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన రైతులు నిబంధనల ప్రకారం డ్రిప్ ఇరిగేషన్ పైపులకు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి



ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

మనుబోలు : వంద రోజుల లక్ష్యంలో భాగంగా మార్చి 31లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ జలజాక్షి హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై తన కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,114 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. వీటిలో రూఫ్ లెవెల్ 90 ఇళ్లు, లింటల్ లెవెల్ 150, బేస్‌మెంట్ లెవెల్ 350 ఇళ్లు ఉండగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అసలు నిర్మాణం ప్రారంభించని(బీబీఎల్) 600 ఇళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. హౌసింగ్ ఏఈ భాస్కర్ రావు, ఏఓ ముజిబున్నిసా, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శరత్, శ్రీనివాసులు ఉన్నారు.

ఇక్కడే చదువుకుంటాం

పొదలకూరు : 'మేము మా పాఠశాలలోనే చదువుకుంటాం.. దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లం ' అని విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు దిగారు. మండలంలోని విరువూరు ప్రగతినగర్ ప్రాథమిక పాఠశాల వద్ద గురువారం పిల్లలు తల్లిదండ్రులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ 3, 4, 5 తరగతుల విద్యార్థులను గ్రామంలోనే మరో పాఠశాలకు పంపేందుకు విద్యాశాఖ అధికారులు జాబితా సిద్ధం చేశారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇక్కడి పిల్లలను మెయిన్ స్కూల్లో విలీనం చేస్తే అంత దూరం తమ పిల్లలు నడిచి వెళ్లలేరన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాల సుమారు 2 కి.మీ దూరంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ పాఠశాలను యథావిధిగా కొనసాగించాల్సిందిగా కోరారు. దీనిపై ఎంఈఓ-2 శోభనాద్రిని వివరణ కోరగా మండలంలో విలీన పాఠశాల జాబితాను సిద్ధం చేశామని, అయితే విరువూరు, పొదలకూరు టైలర్స్ కాలనీలో విద్యార్థులు అక్కడే పాఠశాలలు ఉంచాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు. వారి వినతులను కలెక్టర్, డీఈఓకు అందిస్తామన్నారు.



పాఠశాల ఎదుట ఆందోళనకు దిగిన పిల్లలు వారి తల్లిదండ్రులు

మా పాఠశాలకు అన్యాయం చేయొద్దు



సుబ్బారెడ్డిపాళెంలో ఆందోళన చేస్తున్న యూపీస్కూల్ విద్యార్థులు



గాదెలవాగులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

ముత్తుకూరు : ప్రభుత్వం తమ పాఠశాలకు అన్యాయం చేయవద్దని, తరగతులు తొలగించవద్దని విజ్ఞప్తి చేస్తూ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం ఆందోళన బాట పట్టారు. నారికేళ్లపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేశారు. తమ పాఠశాలలోని తరగతులను జెడ్పీ హైస్కూల్లో విలీనం చేయవద్దని, తమ భవిష్యత్తుకు అన్యాయం చేయవద్దని పలకలపై నినాదాలు రాసి ఆందోళనకు దిగారు. అదేవిధంగా గాదెలవాగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. 3, 4, 5 తరగతులు తొలగించే ప్రక్రియకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల చదువుపై కూటమి బండ

- ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే కుట్ర
- 3, 4, 5 తరగతుల తొలగింపు
- యూపీ స్కూళ్ల ఉనికికి ముప్పు

కూటమి ప్రభుత్వం పేదల చదువులపై గుదిబండను మోపనుంది. సంస్కరణల పేరిట ఫౌండేషన్ స్కూళ్లుగా గుర్తించిన ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసి, ఫౌండేషన్ స్కూళ్లలో తొలగించిన తరగతులను ఇందులో కలిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ అంశం ప్రస్తుతం విద్యారంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది.



బ్రహ్మదేవి గిరిజన కాలనీ పాఠశాల

ముత్తుకూరు : మండలంలో 57 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 41 ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లుగా ముద్రవేశారు. 60 మంది విద్యార్థులు ఉన్న స్కూళ్లను మోడల్ స్కూల్‌గా గుర్తించి, ఫౌండేషన్ స్కూళ్లలో తొలగించిన 3, 4, 5 తరగతులను వీటిల్లో కలుపుతారు. 60 మంది కన్నా తక్కువ ఉన్న ఏకైక ప్రాథమిక పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా నిర్ణయించి, యథావిధిగా కొనసాగిస్తారు. కానీ, ఫౌండేషన్ స్కూళ్లలో తొలగించే 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఎక్కడైతే మోడల్ స్కూల్ ఏర్పాటవుతుందో అక్కడకు వెళ్లి చదువుకోవాలని సర్కారు నిర్ణయించింది. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న యూపీస్కూళ్లు కూడా ప్రమాదంలో పడ్డాయి. ఈ స్కూళ్లల్లోని 6, 7, 8 తరగతులను జెడ్పీ హైస్కూళ్లల్లో విలీనం చేస్తున్నారు. ఈ తరగతుల విద్యార్థులు జెడ్పీ హైస్కూల్ ఎంత దూరంలో ఉన్నా వెళ్లి చదువుకోవాల్సిందే.

చదువులకు దూరమయ్యే ప్రమాదం

నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. పేద పిల్లలకు సర్కారు బడిపై నమ్మకం పెంచేందుకు సకల చర్యలు తీసుకొంది. అయితే, కూటమి ప్రభుత్వం నిర్ణయం ప్రకారం.. ఇళ్ల చెంత ఉంటున్న ఫౌండేషన్ స్కూళ్ల నుంచి తొలగించే 3, 4, 5 తరగతుల పేద పిల్లలు 1, 2 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటయ్యే మోడల్ స్కూళ్లకు వెళ్లాలి. 6, 7, 8 తరగతి విద్యార్థులు దూర గ్రామాల్లో ఉన్న జెడ్పీ హైస్కూళ్లకు వెళ్లాలి. అభద్రత, దూరాభారం భరిస్తూ పేద విద్యార్థులు చదువుకొంటారా అనేది అనుమానమే. ప్రతిపాదన దశలో ఉన్న ఈ పథకం వల్ల వందల సంఖ్యలో పేద విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు చదువు మధ్యలో నిలిపివేసే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ లోకం ఆందోళన వ్యక్తం చేస్తోంది.



ప్రమాదంలో పడిన గురవయ్యసాల పాఠశాల



ఉనికి కోల్పోతున్న పీఎన్ దొరువు పాఠశాల

సర్వేపల్లి నియోజకవర్గంలో 3, 4, 5 తరగతుల తొలగింపునకు గురయ్యే పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలల సంఖ్య
ముత్తుకూరు	41
తోటపల్లిగూడూరు	34
పొదలకూరు	54
మనుబోలు	23
వెంకటాచలం	40

ఎస్‌ఎంసీ తీర్మానాలు కోరుతున్నాం



ఫౌండేషన్ స్కూల్స్‌లో 3, 4, 5 తరగతులను తొలగించడం, మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేయడం వంటి వివరాలు సేకరిస్తున్నాం. ఈ ప్రక్రియ ప్రాథమిక దశలో ఉంది. దీనిని అమలు చేసేందుకు పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తాం. వారి నుంచి తీర్మానాలు స్వీకరించి, ప్రభుత్వానికి పంపిస్తాం.

– మధుసూదన, ఎంఈఓ, ముత్తుకూరు

ప్రైవేట్ స్కూళ్లను ప్రోత్సహించేందుకే..



ప్రభుత్వం తీసుకునే నిర్ణయంతో పేద బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ కార్యక్రమం ప్రైవేటు స్కూళ్లను ప్రోత్సహించే విధంగా ఉంది. ఈ మెర్జింగ్ ప్రమాదం నుంచి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు ఉద్యమాలకు సిద్ధం కావాలి.

– మాస ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, బీటీఏ జిల్లా శాఖ

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో గురువారం జరిగింది. నెల్లూరు నగరం మూలాపేట ప్రాంతానికి చెందిన మురళీధర్ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో ఎదురుగా టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

బుచ్చిరెడ్డిపాళేనికి ఫైర్ స్టేషన్ మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి అగ్నిమాపక కేంద్రం మంజూరైందని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని గురువారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ శాశ్వత అగ్నిమాపక భవనం నిర్మించే వరకు వవ్వేరులోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించాల్సిందిగా ఎమ్మెల్యే అనుమతి ఇచ్చారన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్సై శ్రీహరి

కోవూరు : మోసగాళ్ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్సై వై.శ్రీహరి తెలిపారు. కోవూరులోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవ అక్రమరవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, మహిళలు, బాల బాలికల సంరక్షణ చర్యలు, పోక్సో యాక్ట్ తదితరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఝాన్సీరాణి, సిబ్బంది కె.ప్రసాద్, టీవీఎస్ రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న మీనాక్షి

కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో 'పిల్లల్లో భావోద్వేగం, విద్యాపరమైన సవాళ్ల'పై కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పట్నం మీనాక్షి గురువారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు పరీక్షల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒత్తిడిని దూరం చేసే అంశాలు, మంచి కెరీర్‌ను ఎంచుకునే విధానాలను వివరించారు.

హంస వాహనంపై వెంకటేశ్వరుడు



పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి అమ్మవార్లు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం సుప్రభాత సేవ, మేలుకొలుపు, తోమాల సేవ, నత్యహోమాలు, దాతాది మూలహోమం, కుంకుమార్చన, కలశారాధనం, బలిహరణం, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ జరిగింది. సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్లపై చెత్త వేయొద్దు



చెత్త బుట్టలను అందజేస్తున్న సర్పంచ్

పొదలకూరు : ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలని, రోడ్లపై చెత్త వేయొద్దని పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ కోరారు. పట్టణంలోని తొగటవీధి, పద్మావతినగర్ ప్రాంతాల్లో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులతో కలిసి చెత్త బుట్టలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. ఉప సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్త వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సోమా పద్మావతి, విజయలక్ష్మి, అంజాద్, ఆకులూరు హేమంత్, గుంటి భాస్కర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరించి.. భయపెట్టి

- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే టార్గెట్
- టీడీపీలోకి చేర్చుకునేందుకు విశ్వప్రయత్నాలు



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో శ్రీనివాసులు

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను బెదిరించి, భయపెట్టి అయినా తన పంతం నెగ్గించుకునేందుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొడవలూరు మండలంలోని కొందరు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లను టీడీపీలోకి రావాలని తన అనుచరుల ద్వారా రాయబేరాలు సాగిస్తున్నారు. అయితే టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గకపోవడంతో వారిపై కలెక్టర్, డీపీఓలకు ఆయా పంచాయతీల్లో అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదులు చేయించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే.. నోటీసులు పంపించారు. ఆ నోటీసులకు సమాధానం ఇవ్వలేదని, ఆయా సర్పంచ్‌ల చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు చేయిస్తూ సంబంధిత అధికారులతో ఆదేశాలు జారీ చేయించారు. ఈ క్రమంలో ఆయా సర్పంచ్‌లపై రాజకీయంగా ఒత్తిడి పెంచడంతో వారు దిగిరాక తప్పడం లేదు. కొడవలూరు మండలం రేగడిచెలిక పంచాయతీకి సంబంధించి ఏడాది కాలం రికార్డు లేదని, సుమారు రూ.కోటి వరకు నిధులు దుర్వినియోగం అయినట్లు చూపించారు. దీంతో సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు చెక్ పవర్‌ను రద్దు చేయడంతో ఎట్టకేలకు ఆయన తన చెక్ పవర్‌ను పునరుద్ధరించుకునేందుకు గురువారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసి టీడీపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

బాలుడిని బెదిరించి ఫోన్‌పే ద్వారా డబ్బు కాజేసి

బుచ్చిరెడ్డిపాళెం : బాలుడిని బెదిరించి ఫోన్‌పేలో డబ్బులు వేయించుకున్న ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ప్రవీణ్ అనే బాలుడిని ఇద్దరు వ్యక్తులు బెదిరించి ఫోన్‌పేలో రూ.500లు వేయించుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. బాలుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌రెడ్డి తెలియజేశారు.

జేసీతో ఎమ్మెల్యే భేటీ



జేసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : నియోజకవర్గ రైతు సమస్యలపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌తో గురువారం సమావేశమయ్యారు. వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల ద్వారా జరిపే ధాన్యం కొనుగోళ్లలో కీలకపాత్ర పోషించే సహకార సొసైటీ సిబ్బందికి కమీషన్ల బకాయిలు చెల్లించాలని తెలిపారు. పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం : వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వివిధ వార్డుల్లో రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నైట్‌షిఫ్టుల్లో తప్పనిసరిగా డాక్టర్ల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న అదనపు బ్లాక్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఎంవీఐ పూర్ణచంద్రరావు

పొదలకూరు : వాహనచోదకులు నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వీలుకలుగుతుందని నెల్లూరు అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ పెట్టుకోవాల్సిందిగా సూచించారు. ప్రజల్లో ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూప, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లను నివారించుకోండి



కొడవలూరు : గుండాలమ్మపాళెంలో వరిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

కొడవలూరు : నూతన వరి వంగడమైన కేఎన్‌ఎం 7715 రకాన్ని కాండం తొలుచు పురుగు ఆశించి ఉన్నందున వెంటనే నివారించుకోవాలని కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్త విజయకుమార్ సూచించారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో సాగులో ఉన్న నూతన వరి వంగడాన్ని జిల్లా వనరుల కేంద్రం ఏఓలతో కలిసి గురువారం ఆయన పరిశీలించి నివారణ చర్యలు సూచించారు. అనంతరం వెంకన్నపురంలో వరి పంటను పరిశీలించి ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకానికి మానిపండు తెగులు ఆశించి ఉండడాన్ని గుర్తించి హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్‌ను లీటరు నీటిలో కలిపి లేదా ప్రాపికొనజోల్ ఒక మిల్లీలీటర్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసి నివారించుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓలు గీతాకుమారి, మధురిమ, ఏఓ లక్ష్మి, వీఏఏలు కె.విష్ణుప్రియ, బి.లిఖిత, స్థానిక నేతలు కె.అమరేంద్రరెడ్డి, డేగా మధుసూధన్ రావు పాల్గొన్నారు.



కోవూరు : క్షేత్ర సందర్శన

➡ కోవూరు : మండలంలోని వేగూరు, లేగుంటపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ ఇందిరావతి క్షేత్ర సందర్శన చేసి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు సుభాషిని, చైతన్య, వంశీ పాల్గొన్నారు.

బుచ్చికి తక్కువ సిబ్బంది కేటాయింపు

బుచ్చిరెడ్డిపాళెం : నూతనంగా ఏర్పడిన నగర పంచాయతీల్లో బుచ్చిరెడ్డిపాళేనికి తక్కువ మంది సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. మొత్తం 33 మంది సిబ్బంది నియామకాలు కావాల్సి ఉండగా కేవలం 14 మందినే ప్రభుత్వం నియమించింది. ఇక్కడ కమిషనర్, మేనేజర్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అకౌంటెంట్, అసిస్టెంట్ ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ సర్వేయర్, రికార్డు అసిస్టెంట్, బిల్ కలెక్టర్, స్వీపర్, నైట్ వాచ్‌మెన్‌ల నియామకం జరిగింది. సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పం నగర పంచాయతీని మున్సిపాలిటీగా మార్చి 44 మంది సిబ్బందిని నియమించడం అధికార పార్టీ పక్షపాత వైఖరికి అద్దం పడుతోంది.